క్లుప్తంగా

బీసీలకు రక్షణ చట్టం ఎప్పుడు!

నెహ్రూనగర్: బీసీలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ ఆరోపించారు. చుట్టుగుంటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీలకు బీసీ రక్షణ చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ నిరుద్యోగుల కోసం ఎస్సీ ఎస్టీ మాదిరిగానే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిళ్లు, వసతి గృహాలను సకల సౌకర్యాలతో, బీసీ విద్యార్థులకు నిర్మించాలని లేని పక్షంలో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు ధర్నాలు చేపడతామని క్రాంతి కుమార్ తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో భాష్యం విద్యార్థిని ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా వివిధ రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. మంగళవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో చదరంగంలో విశేష ప్రతిభ కనబరిచిన భాష్యం జూనియర్ కళాశాల విద్యార్థిని ఆమంచి నాగశివ సాయిదివ్యను అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ క్రైట్స్ కాస్టిల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తాడికొండ మండలం లాంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన ఓపెన్ అండ్ గరల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 చదరంగపు పోటీల్లో అండర్-16 బాలికల విభాగంలో భాష్యం జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగశివసాయిదివ్య రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా నాగశివసాయిదివ్యను అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

టీజేపీఎస్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ సుబ్బారావుకు నివాళి



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుబ్బారావు 91వ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులైన సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఉమ్మడి ఏపీ శాసనసభ ప్రథమ మహిళా స్పీకర్ కె.ప్రతిభాభారతి పాల్గొని సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల రెండో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి శ్యాం సుందర్, కేవీ బ్రహ్మం, పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ రవి, మద్ది వెంకటేశ్వరరావు, కళాశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ డాక్టర్ జీవీ కృష్ణారావు, ప్రథమ మహిళా ప్రిన్సిపాల్ టి.రాధాబాయి, అధ్యాపకులు, విద్యార్థుల పాల్గొన్నారు.

108 కిలోల కుంకుమతో విశేష పూజ



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



పూజల్లో పాల్గొన్న భక్తులు



మంగళగౌరిగా శ్రీకనక మహాలక్ష్మి

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ మందిరం కోటి కుంకుమార్చనలో భాగంగా శ్రావణ మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యపూజలతోపాటు వేద మంత్రాల నడుమ 108 కిలోల కుంకుమతో విశేష పూజలు జరిగాయి. నక్షత్ర హారతి, మంత్ర పుష్పం అనంతరం తీర్థ, అన్న ప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మంగళగౌరిగా అమ్మవారు

స్థానిక సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మి మందిరంలో అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. వ్యవస్థాపకుడు ఘంటసాల విజయకుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా ఎంపీ అయోధ్య జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అంబటి మురళీకృష్ణ, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

పట్నంబజారు: రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎంపీ అయోధ్యరామిరెడ్డి జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మోదుగుల మాట్లాడుతూ కష్టకాలంలో ఒక వ్యాపారవేత్తగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో మా అందరికి అయోధ్య, కొండంత అండ అని కొనియాడారు. ఆయన జన్మదినంతో పాటు పార్టీ బాధ్యతలను ఆయన భుజాన వేసుకుని ముందుకు సాగే పరిస్థితి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఎంపీ అయోధ్యరామిరెడ్డి రాజకీయంగా ఎటువంటి సమస్య ఉన్నా.. మమ్మల్ని పోత్సహించి మమ్మల్ని ముందుకు నడిపించే వ్యక్తి ఆయన అని అన్నారు. పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు, కాకాని ముద్దుబిడ్డ అయిన అయోధ్య కాకాని ప్రజలకు ఎంతో మంచి సేవ చేసి రాజకీయాల్లో వచ్చారు. స్వచ్ఛందంగా ప్రజలకు మంచి చేస్తున్న గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, తాడిబోయిన వేణు, పఠాన్ సైదాఖాన్, అవినాష్, సురసాని వెంకటరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖి వన్ స్టాప్ సెంటర్



నెహ్రూనగర్: మహిళలకు భద్రత కల్పించడంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అండగా ఉంటుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ పి.ప్రసూన తెలిపారు. మంగళవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో హింసకు గురైన మహిళలకు ఈ సెంటర్ అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని చెప్పారు. అవసరమైన వైద్య, న్యాయ సలహాలు అందిస్తుందని తెలిపారు. సెంటర్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, డీఎంహెచ్‌ఓ తదితర 16 మంది ఆయా శాఖల అధికారుల సమన్వయంతో బాధిత మహిళల సమస్యలకు సత్వర పరిష్కారం దిశగా ప్రయత్నిస్తారని చెప్పారు. తాత్కాలిక వసతి కూడా కల్పిస్తామని వివరించారు. మహిళలు హింసకు గురైతే వెంటనే సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 86887 22120 ఫోను నంబర్‌కు లేదా 181కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

కీమోథెరపీ వలన జుట్టు రాలకుండా చర్యలు

గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ వలన జుట్టు రాలకుండా నియంత్రించే ఆధునిక సాంకేతిక వైద్య పరికరాన్ని తమ ఆస్పత్రిలో ఏపీలోనే మొట్టమొదటిసారిగా అందుబాటులోకి తెచ్చామని ఆర్కా హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ పవన్‌రాఘవరెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక మంగళగిరి రోడ్డులోని ఆర్కా హాస్పిటల్‌లో స్కాల్ప్ కూలింగ్ టెక్నాలజీని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో నూతనంగా తీసుకొచ్చిన వైద్య పరికరం ద్వారా తల చర్మ ఉష్ణోగ్రతను తగ్గించి రక్తప్రసరణను నియంత్రించి కీమోథెరపీ చేసిన జుట్టు రాలటాన్ని తగ్గిస్తుందని చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ హేమంత్ మాకినేని, సీనియర్ క్యాన్సర్ వైద్యనిపుణులు, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ శౌరిరాజునాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేంద్ర అండదండలతో బరితెగింపు

- భార్యను బెదిరిస్తున్న పాల్‌రాజ్‌ను అరెస్ట్ చేయాలి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్



పట్నంబజారు: పొన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అనుచరుడు భార్యను వదిలించుకోవాలని చూస్తున్నాడని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వెంకటేశ్వరమ్మను, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పాల్‌రాజు 7 ఏళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడని తెలిపారు. భార్యకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని కాజేసి ఇప్పుడు భార్యను వదిలించుకోవాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. బాధితురాలు పొన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే... చంపుతానని భర్త పాల్‌రాజ్ బెదిరిస్తున్నాడని తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ప్రధాన అనుచరుడుగా ఉండే పాల్‌రాజు నుంచి తప్పించుకొని అతని భార్య ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల చేసిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు అన్ని కూడా కట్ట కట్టి ఉన్నాయని, అవన్నీ బయటకు తీస్తామని హెచ్చరించారు. వెంకటేశ్వరమ్మ ఘటనలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల పాత్ర లేకుంటే వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రమేయం లేకుంటే బాధితురాలకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని కలిసి విన్నవించాలన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల అవినీతి అక్రమాల డైరీని ప్రజలకు వివరిస్తామన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర అవినీతి అక్రమాలపై చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంటూరు ఖ్యాతిని చాటేలా జాతీయ జెండా ప్రదర్శన

నెహ్రూ నగర్: జాతీయ స్థాయిలో గుంటూరు ఖ్యాతిని చాటేలా హర్ ఘర్ తిరంగా 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన నిలిచేలా సమష్టి కృషితో విజయవంతం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ఈ నెల 14న చేపట్టనున్న హర్ ఘర్ తిరంగా జాతీయ జెండా ప్రదర్శనపై జీఎంసీ, విద్యా శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత కమిషనర్ చాంబర్‌లో మేయర్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో జాతీయ జెండా ప్రదర్శనకు గుర్తించిన రోడ్లు, ట్రాఫిక్ అంశాలపై చర్చించారు. నగరంలో మదర్ థెరిస్సా విగ్రహం నుంచి ఎల్వీఆర్ క్లబ్, కోరిటెపాడు జంక్షన్, ఐటీసీ హోటల్, జేకేసీ కాలేజీ రోడ్, ఆర్టీఓ ఆఫీస్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్-ఫేజ్ 2, చిల్లీస్ ధాబా జంక్షన్, లాడ్జి సెంటర్ మీదుగా తిరిగి మదర్ థెరిస్సా విగ్రహం వరకు రూట్ మ్యాప్‌ని సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకంగా గుంటూరు నగరంలో తొలిసారిగా పది కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన చేపడుతున్నామన్నారు. జాతీయ జెండా ప్రదర్శనలో నిర్దేశిత ప్రోటోకాల్ పాటించాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరారామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అవసరాన్ని గుర్తించాలి

లక్ష్మీపురం: గ్రంథాలయాల్లో మనసుకు ప్రశాంతత, చదువుకు ఏకాగ్రత లభిస్తాయని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రచయిత, కవి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ విశ్వ మానవాళిని పుస్తక పఠనం వైపు ఆకర్షించడానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించాలని సూచించారు.

అనుబంధ విభాగాలు త్వరగా పూర్తి చేస్తాం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



అనుబంధ విభాగాల అంశంపై చర్చిస్తున్న నూరిఫాతిమా, మస్తాన్‌వలి

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకి అయినా.. అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నూరిఫాతిమాను మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు నియోజకవర్గం, నగర అనుబంధ విభాగాల కమిటీల గురించి ప్రస్తావించారు. త్వరితగతిన కమిటీలు పూర్తి చేసేలా దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా నగర, తూర్పు అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించేలా పదవులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సమన్వయకర్తలను కలిసి త్వరగా కమిటీలు పూర్తి చేయాలని కోరుతున్నట్లు వివరించారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం పోరుబాట



జిల్లా సీపీఐ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన అరుణ్‌కుమార్

లక్ష్మీపురం: ప్రభుత్వ విద్యా పరిరక్షణకు పోరు సాగించాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటీ అరుణ్‌కుమార్ కోరారు. గుంటూరు కొత్తపేటలోని అఖిల భారత విద్యార్థి సమాఖ్య గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బ్రిటిష్ వారికి తొత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని తప్పుపట్టారు. తల్లికి వందనం పథకానికి షరతులు పెట్టి చాలామంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు ,కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, అమర్నాథ్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, అజయ్, ఆనంద్, అమీర్, ప్రసన్న, సుబ్బు, నాని, కుమార్, కార్తీక్, దుర్గ ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల గ్రంథాలయ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథ పాలకుల పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సమన్వయకర్త సీహెచ్ అరుణ జ పాల్గొన్నారు.


2047 నాటికి నంబర్‌వన్ స్థానానికి భారత్



జెండాలు పట్టుకుని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్: భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచ దేశాలలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టటానికి మన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని బీజేపీ గుంటూరు ఈస్ట్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలో రాష్ట్ర పార్టీ సూచనల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశ భక్తి కలిగి ఉండాలని చెప్పారు. సుంకం పైన జరిగే పోరాటంలో మోదీకి పూర్తిగా మద్దతు తెలిపారు. సమావేశం అనంతరం కొత్తపేటలోని కార్యాలయం నుంచి జాతీయ జెండాలతో ర్యాలీగా బయలుదేరి నాజ్ సెంటర్ సర్కిల్ లో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సురేష్ కుమార్ జైన్, దేసు సత్యనారాయణ, నారాయణ రెడ్డి, మలిశెట్టి పవన్ కుమార్, దేవిశెట్టి బాబూరావు, మైలవరపు ప్రవీణ్, జూలకంటి సుబ్రహ్మణ్యం, తల్లం మనోజ్, వేమూరి అనిల్ పాల్గొన్నారు.

డాక్టర్ ఘంటా చైతన్యకు అభినందన



షీల్డ్ అందుకుంటున్న డాక్టర్ ఘంటా చైతన్య

గుంటూరు మెడికల్: ప్రముఖ ఆర్థ్రోస్కోపిక్ సర్జన్, శ్రీ సంకల్ప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఘంటా చైతన్య అత్యంత క్లిష్టమైన ఆర్థ్రోస్కోపిక్ ఏసీఎల్, పీఎల్‌సీ రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీలు లైవ్‌లో చేసి చూపించారు. ఈనెల 10న బెంగళూరులో మిత్రకాన్ జాతీయ సదస్సు డాక్టర్ భరత్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. లైవ్‌సర్జరీ చేసిన డాక్టర్ ఘంటా చైతన్యకు డాక్టర్ కె.ఎస్. సుబ్రహ్మణ్యం షీల్డ్ అందజేసి అభినందించారు. జాతీయ సదస్సులో షీల్డ్ అందుకున్న డాక్టర్ చైతన్యను మంగళవారం స్థానిక గుంటూరు వారితోట 8వ లైన్‌లోని ఆస్పత్రిలో గుంటూరు ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ నేతలు, పలువురు ఇతర వైద్యులు అభినందించారు. క్రీడల్లో గాయపడిన వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థ్రోస్కోపీ సర్జరీలు చేస్తున్న డాక్టర్ చైతన్యకు గత ఏడాది సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ఆర్థ్రోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ విభాగంలో టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ హెల్త్ కేర్ -2024 అందుకున్నారు.